4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 27 ఫిబ్రవరి 2025
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# ట్రంపిజం శాంతిని స్థాపించేనా?

ఎనభయ్యవ దశకంలో ఇద్దరు నాయకుల పేర్లు అంతర్జాతీయంగా మార్మోగేవి. ఒకరు, అమెరికా అప్పటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్. రెండు, బ్రిటన్ ప్రధాని మార్గరెట్ థాచర్. ఇద్దరూ సోవియట్ మహా సామ్రాజ్యం పతనానికి అలుపు లేకుండా పనిచేశారు. వామపక్ష విధానాలకు వ్యతిరేకులు, వాణిజ్య వర్గాలకు అనుకూలురు. వారిద్దరి పేర్ల మీదనే రీగనామిక్స్, థాచరిజం అనే సైద్ధాంతిక ధోరణులు ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇప్పుడు ఆ రెండింటి కలగలుపుగా ట్రంపిజం ముందుకువస్తున్నది. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నూతన ధోరణికి కారకుడని విడమరచి చెప్పాల్సిన పనిలేదు. ట్రంప్ మాటకారి. మంచి వ్యాపారి. రెండో విడత గెలిచి నెల రోజుల క్రితం అగ్రరాజ్యం పగ్గాలు చేపట్టిన తర్వాత ఆయన ప్రపంచ దేశాలకు చుక్కలు చూపిస్తున్నారు. ట్రంప్ హయాంలో అంతర్జాతీయ నీతి సూత్రాలు, దౌత్య మర్యాదలు గాలిలో కలిసిపోయాయి. నిన్నటి దాకా ఒక ప్రభుత్వాధినేత, అందునా అమెరికా వంటి అగ్రరాజ్యాధినేత ఈ తరహాలో మాట్లాడగలరా? అంటే లేదనే సమాధానం వచ్చేది. కానీ, ఇప్పుడు సీన్ మారింది. అరమరికలు లేవు, దాపరికాలు అసలే లేవు. దేశాలకు ఉండే సార్వభౌమాధికారాలను ట్రంప్ తీసికట్టు అంటున్నారు. మెక్సికో సింధు శాఖ పేరు అమెరికా సింధు శాఖగా ఆయన ఒక్క కలం పోటుతో మార్చేశారు. కెనడా మా దేశంలో 51వ రాష్ట్రంగా చేరాలనడం ఆయనకే చెల్లింది. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాకు అప్పగించాలని హాలండ్‌కు తాకీదు జారీచేయడం ఆయనకే చాతనైంది. కొన్నాళ్లు ఫర్మానాలు ఎడా పెడా జారీచేశారు. ఇప్పుడు సంతకాలు చేసే ఓపిక కూడా లేదేమో, నా మాటే శాసనం అంటున్నారు. తాజాగా ఆయన ఉక్రెయిన్ మీద పడ్డారు. అంతర్జాతీయ భద్రత, వనరులపై ఆధిపత్యం వంటి కీలక అంశాలు ముడిపడి ఉన్న ఈ విషయంపై తనదైన ధోరణిలోనే దూకుడుగా వెళ్తున్నారు. యుద్ధాన్ని ముగించాలనేది సదాశయమే కానీ, ఆ దిశగా ట్రంప్ వేస్తున్న అడుగులు ఆందోళన కలిగిస్తున్నాయి.

డోనాల్డ్ ట్రంప్ శాంతి ప్రతిపాదనల్లో నాలుగు ప్రధానాంశాలున్నాయి. మొదటిది, రష్యా 2014 నుంచి ఆక్రమించిన భూ భాగాలను ఉక్రెయిన్‌కు వదులుకోవడం. ప్రస్తుత యుద్ధంలో ఆక్రమించుకున్నవి కూడా ఇచ్చేయాలంటున్నారు. రెండోది, రష్యా-ఉక్రెయిన్ మధ్య నిస్త్రనిక మండలం ఏర్పాటు. దీని పర్యవేక్షణ బాధ్యత నాటోకు ఇవ్వకుండా యూరప్ దేశాలకు అప్పగించవచ్చు. మూడోది, నాటోలో చేరే ప్రయత్నాలను ఉక్రెయిన్ మానుకోవడం. నాలుగోది, అమెరికా-ఉక్రెయిన్ వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఉక్రెయన్‌లోని లక్షల కోట్ల ఖనిజ సంపదను అమెరికాకు అప్పగించడం. జాతీయ ప్రభుత్వాలు భూ భాగాలను వదులుకొనేందుకు ఒప్పుకోవనేది తెలిసిందే. ఇక యుద్ధం మొదలైందే నాటోలో చేరికపై. ఆ ఒక్క కారణం మీదనే రష్యా దాడికి తెగబడటంతో ఉక్రెయిన్ మరుభూమిగా మారింది. లిథియం వంటి కీలక ఖనిజాలు ఉక్రెయిన్‌లో దండిగా ఉన్నాయి. ఇన్నాళ్లూ అందించిన సాయానికి బదులుగా ఆ సంపదనంతటినీ అమెరికాకు ధారాదత్తం చేయాలంటున్నారు ట్రంప్. ఇవన్నీ తాఖీదుల రూపంలోనే వెలువరించారాయన. పైగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని బహిరంగంగా అవమానించారు. ఆయన ఓ నాసిరకం కమేడియన్ అన్నట్టుగా మాట్లాడారు. జెలెన్‌స్కీ యుద్ధం మొదలుపెట్టారన్నారు. ఎన్నికలు జరుపకుండా అధికారంలో కొనసాగుతున్న నియంత అని మండిపడ్డారు. జెలెన్ స్కీ పాపులారిటీ రేటింగ్‌లో అట్టడుగున ఉన్నారని ఎద్దేవా చేశారు.

యుద్ధసాయం పేరిట అమెరికాను పీల్చి పిప్పి చేశారని, అందుకు బదులుగానే ఖనిజ సంపదను అప్పగించాలని బేరం పెట్టారు. పైగా అమెరికా-రష్యా మధ్య జరిగిన శాంతి చర్చలకు యుద్ధబాధిత ఉక్రెయిన్‌ను పిలవకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించే అంశమని చెప్పాలి. ఇక నాటో అనవసరమనే ధోరణిలో ట్రంప్ మాట్లాడటం యూరోపియన్ దేశాలకూ మింగుడు పడటం లేదు. అమెరికాతో ప్రమేయం లేకుండానే ఉక్రెయిన్‌కు సైనిక సాయం అందించాలని అవి తీర్మానించుకోవడం మరో మలుపు. ట్రంప్ మధ్యవర్తిత్వంలో ఉక్రెయిన్‌లో శాంతి ఎప్పుడు, ఎలా నెలకొంటుందనే విషయమై స్పష్టత ఏదీ లేదు. రష్యా ఎంతవరకు, ముఖ్యంగా వనరుల విషయంలో, కలిసి వస్తుందనేది పెద్ద ప్రశ్న. ట్రంప్ వ్యాపారంలో దిట్ట కావచ్చు. కానీ, రియల్ ఎస్టేట్ డీల్స్ కుదుర్చుకున్నంత సులభంగా యుద్ధాలకు పరిష్కారం కనుగొని అమలుచేయడం సాధ్యం కాదని ఆయన తెలుసుకోవడం మంచిది.

# సవాళ్లకు సమయం ముందున్నది

సవాళ్లు విసరడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ముందూ వెనుకా ఆలోచన లేనట్టున్నది. తనను మించిన పాలకులు ఈ దేశంలోనే లేరని పదే పదే పలకడం ఆయనకు అలవాటైపోయింది. ఎవరి పాలననైనా అక్కడి ప్రజలు మెచ్చుకోవాలి, రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానించాలి కానీ, తనకు తానే గొప్పగా చెప్పుకోవడం సంస్కారం కాదు. సవాళ్లు చేయాలనుకుంటే రేవంత్‌రెడ్డి తనలాగే కొత్తగా, తొలిసారిగా ముఖ్యమంత్రి అయిన వ్యక్తితో పోల్చుకోవాలి. దాన్ని సమఉజ్జీ అంటారు. ఆ పోలికకు కూడా అర్థం ఉంటుంది. దశాబ్దానికి పైగా వివిధ హోదాల్లో మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా పనిచేసిన వారితో 'నాతో సవాలుకొస్తారా!' అనడం తన హద్దులను మీరి మాట్లాడటమే అవుతుంది.



బద్రినర్సన్
9440128169

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటుచేసే బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి చేసే ప్రసంగాల్లో ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీలపై విరుచుకుపడటమే ఎక్కువగా ఉంటుంది. ఆయన మాటల్లోని దురుసుతనం ఇతరులను అగౌరవపరిచేలా, తన కుర్చీ విలువ తగ్గేలా కనబడుతున్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తుకురాగానే నిండు సభలో శివాలెత్తడం ఆయనకు సహజ ధోరణి అయిపోయింది. నిజానికి కేసీఆర్ పోరాటం లేకపోతే తెలంగాణ రాష్ట్రం లేదు. ప్రత్యేక రాష్ట్రం రాకుంటే రేవంత్‌కు ముఖ్యమంత్రి సీటు దొరికేదే కాదు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని గెలిచిన రోజు నుంచి వల్లించడం కాంగ్రెస్ పెద్దలకు మామూలైంది. నిజానికి కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ పాలనా అవకాశం వడ్డించిన విస్తరిలా దొరికింది. అలవికాని హామీలతో రాష్ట్ర ఆర్థికవ్యవస్థను అంచనా వేయలేని కబోదితనం కాంగ్రెస్ పెద్దలది. గెలిచిన తర్వాత పాత ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడం చేతగాని తనమే అవుతుంది. చేతికొచ్చిన పాలనలో తమ శక్తియుక్తులేమిటో ప్రదర్శించి ప్రజల మెప్పు పొందడం కాంగ్రెస్ ముందున్న కర్తవ్యం.

ఈ మధ్య నారాయణపేట బహిరంగ సభలో రేవంత్ రెడ్డి తన పాత సవాల్‌ను మరోసారి విసిరారు. తన ఏడాది పాలనతో కేసీఆర్, నరేంద్ర మోదీ పదేండ్ల పాలనను పోల్చి చర్చించేందుకు ఆ పార్టీల నేతలు సిద్ధమా అని ప్రకటించారు. నిజానికి రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్న పథకాలన్నీ కేసీఆర్ సృష్టియే. వాటికే కొంత మొత్తాన్ని పెంచి చెప్పి ఓటర్లను తమ వైపు తిప్పుకొన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇక్కడా అమలుచేస్తున్నారు. దీనివల్ల గిరాకీ తగ్గి నష్టపోతున్న ఆటోడ్రైవర్లను ఆదుకుంటామని చెప్పి, వారికి ఇంతవరకు ప్రభుత్వం చేసిందేమీ లేదు.

**కేసీఆర్ పథకాలకు పేర్లు మార్చి, సొమ్ము పెంచామన్నా వాటి అమల్లో ఎన్నో వైఫల్యాలున్నాయి. రైతు రుణమాఫీ అందరికీ అందలేదు. రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో పడలేదని రైతులంటున్నారు. పంటల బీమా ఊసే లేదు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అభ్యర్థనల్లో సగం మందికి 2024, ఆగస్టులో నిధులు విడుదల కాగా, మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. తులం బంగారం మాత్రం ఎవరికీ ముట్టలేదు.**

పదవీ విరమణ పొందిన వందల మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన ప్రయోజనాలు ఏడాదిగా మూలన పడ్డాయి. సర్వీసు కాలంలో కూడబెట్టుకున్న మొత్తం, ప్రభుత్వం తరపున చెల్లించాల్సిన సొమ్ము విశ్రాంత ఉద్యోగులకు ఎంతో అవసరం. ఎక్కడివాళ్లక్కడ అసంతృప్తితో బేజారవుతుండగా 'నాసాటి లేరెవ్వరు' అని అనడం మన ముఖ్యమంత్రికే చెల్లింది. 55 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకం, రైతులకు రూ.22 వేల కోట్ల రుణమాఫీ.. ఈ రెండింటినీ పదే పదే ప్రస్తావిస్తూ పది నెలల కాలంలో దేశంలో ఎవరైనా ఈ ఘనకార్యం చేశారా అని సవాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి తన గొప్ప అని చెప్పుకొనే ప్రతి మాట వెనుక తెలంగాణ ప్రజల త్యాగం, బీఆర్ఎస్ కృషి ఉన్నవి. అయితే, అంతా తన ప్రతిభతోనే మొదలైనట్టు, తాను ముఖ్యమంత్రి అయ్యాకే సాధించినట్టు చెప్పుకోవడం ఆయనకు అలవాటైపోయింది.



నిజానికి ఆయన ఎక్కుతున్న ప్రతి మెట్టు బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిలో భాగంగా నిర్మించబడినవే. ఆ విషయం స్పష్టంగా తెలిసినా పాత ప్రభుత్వానికి ఏ కీర్తి దక్కవద్దని జాగ్రత్త పడుతూ, అంతా నా గొప్పతనమే అని చెప్పుకొంటున్నారు. 2024, జనవరిలో సుమారు 7 వేల నర్సు పోస్టులకు నియామక పత్రాలు అందజేసినప్పుడు కూడా ఈ ప్రక్రియను గత ప్రభుత్వం ఆరంభించింది అని ఒక్క మాట అనలేదు. మొన్నటికి మొన్న యాదగిరిగుట్టలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయ గోపురానికి బంగారు తాపడం ఆవిష్కరణ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి దంపతులు హాజరయ్యారు. భక్తులు, దాతల నుంచి బంగారాన్ని సేకరించిన ఘనత గత ప్రభుత్వానిది. రేవంత్‌రెడ్డి అదృష్టజాతకుడు. పిసరంత బంగారం కూడా ఇవ్వకుండా తన చేతుల మీదుగా స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించే అవకాశం ఆయనకు దక్కింది. గోపురానికి అవసరమైన బంగారం, నిధుల సేకరణ అంతా కేసీఆర్ హయాంలో జరిగింది. దాతల్లో కిలో బంగారం ఇచ్చినవారు కూడా ఉన్నారు. అయితే, ఈ ఉద్ఘాటన సందర్భంగా దాతలందరికీ ఆహ్వానం అందిందో లేదో కానీ, వారికోసం ఏర్పాటుచేసిన కుర్చీలు చాలావరకు ఖాళీగా ఉన్నాయని పత్రికల్లో వచ్చింది.

ఇక బీజేపీపై ఆయన చేస్తున్న సవాళ్లు ప్రధాని మోదీ లక్ష్యంగా సాగుతుంటాయి. మోదీ 14 ఏండ్లు గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఏ ఒక్క సంవత్సరమైనా 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశారా అని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను ప్రశ్నిస్తూ.. చర్చకు రమ్మంటున్నారు. ఒక ప్రభుత్వం చేసినదాన్ని మరో ప్రభుత్వం చేయాల్సిన అవసరం లేదు. ఎవరి ప్రాథమ్యాలు వారికి ఉంటాయి. ఇప్పుడు రేవంత్‌రెడ్డి అడిగాడని ఆ ప్రభుత్వం పాత లెక్కలన్నీ ముందేసుకొని సమాధానం చెప్పదు. మరోసారి కేంద్రంలో పన్నెండేండ్ల మోదీ పాలన, తెలంగాణలో 12 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా అని కేంద్ర మంత్రులకు సవాలు విసురుతారు. ఈ చర్చలో తాను ఓడిపోతే ముక్కు నేలకు రాస్తాననడం చౌకబారుగా ఉన్నది. రేవంత్‌రెడ్డి సవాలుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సరే అంటూ తారీఖు, స్థలం నిర్ణయిస్తే చర్చకు వస్తామన్నారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి నుంచి ఎలాంటి సమాధానం ఇంతవరకు రాలేదు.

ప్రధానంగా ఒకరి పాలన మరొకరితో పోల్చి చూసేందుకు కుదరదు. ఇలాంటి సవాళ్లు, చర్చలు కాలయాపనకే పనికివస్తాయి. రేవంత్ రెడ్డి అడిగారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి అధికారులు లెక్కలన్నీ ముందేసుకొని సమాధానాలు సిద్ధం చేయరు. ఆయన సవాళ్లను రాజకీయ ఎత్తుగడగానే తేలిగ్గా తీసుకుంటున్నారు. మొదటి సంవత్సరం సరే.. మరో ఏడాది కూడా కాంగ్రెస్ పాలన గడవనీ.. మరో 55 వేల మంది ఉద్యోగాల్లో చేరనీ, స్థానిక ఎన్నికలు పూర్తవనీ, రైతులకు రెండు పంటల భరోసా అందనీ, కులగణన ప్రయోజనాలు బీసీలకు దక్కనీ.. కోటి మంది మహిళలు కోటీశ్వరులు కానీ.. సవాళ్లు విసరడమే కాదు, వాటిని ఎదుర్కొనే కాలం కూడా కాంగ్రెస్‌కు వస్తుంది. అప్పుడు ప్రజలకు సమాధానం చెప్పుకొంటే చాలు.

**ప్రధానంగా ఒకరి పాలన మరొకరితో పోల్చి చూసేందుకు కుదరదు. ఇలాంటి సవాళ్లు, చర్చలు కాలయాపనకే పనికివస్తాయి. రేవంత్ రెడ్డి అడిగారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి అధికారులు లెక్కలన్నీ ముందేసుకొని సమాధానాలు సిద్ధం చేయరు. ఆయన సవాళ్లను రాజకీయ ఎత్తుగడగానే తేలిగ్గా తీసుకుంటున్నారు.**

## • 'గుమ్మడి'.. నీ గుమ్మం తొక్కొద్దా?



నిజాయితీ, క్రమశిక్షణకు నిలువెత్తు రూపం గుమ్మడి నర్సయ్య. ఇల్లెందు ప్రజలు ఆయనను ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. ప్రజా ఉద్యమాల నాయకుడిగా పేరొందిన నర్సయ్యకు జూబ్లీహిల్స్ ఎనుముల ప్యాలెస్ ముందు పడిగాపులు కాసేలా పరిస్థితిని కల్పించడం నియంతృత్వ పాలనా స్వభావానికి నిదర్శనం. 'ఓటుకు నోటు' పంచకుండా ఐదు సార్లు గెలవడం, పదవిలో ఉన్నప్పుడు జీతం (గౌరవ వేతనం) సైతం నమ్ముకున్న పార్టీకే ఇవ్వడం, నాలుగు దశాబ్దాలకు పైగా ఒకే రంగు జెండాను మోయడం, జీవితాంతం నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండటం ప్రస్తుత రాజకీయాల్లో అంత తేలికైన విషయం కాదు. కానీ, రాజకీయాల్లో నర్సయ్య జీవితం మాత్రం భవిష్యత్తు తరాలకు ఆదర్శం. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆయనకు అబద్ధాలను ఇంధనంగా వాడుకొని రాకెట్ వేగంతో ముఖ్యమంత్రి పీఠం అధిరోహించిన ఎనుముల రేవంత్ రెడ్డి నాలుగు సార్లు అపాయింట్‌మెంట్‌ను నిరాకరించడమంటే నిజాయితీ, నిబద్ధతలకు సమాధి కట్టడమే. అయినా, వ్యక్తిగత ఎదుగుదలే లక్ష్యంగా పార్టీలు మార్చి, సీనియర్లకు పంగనామం పెట్టే రేవంత్‌కు 'రాజకీయ విలువలు' అనే పదం పెద్దగా రుచించకపోవచ్చు.



ప్రగతిభవన్ కంచెలు తొలగిపోయాయి. 'ప్రజా పాలన' మొదలైంది. సమస్యలున్నప్పుడు నా ఇంటి ద్వారాలు తెరిచే ఉంటాయని స్వయంగా రేవంత్ రెడ్డి బీరాలు పలికారు. కానీ, ఆయన అదానీ వంటి వాళ్లకు రెడ్ కార్పెట్ పరుస్తూ, . ప్రజాగొంతుక అయిన నర్సయ్యను మాత్రం ఎర్రటి ఎండలో నిలబెట్టడం గర్హనీయం. ప్రజాస్వామ్య పరిరక్షణే ఏడో గ్యారెంటీ అంటూ ఊదరగొడుతున్న కాంగ్రెస్ పాలకులు ఏడాది దాటినా కనీసం ఆరు గ్యారెంటీలను అమలుచేయకపోవడం సిగ్గుచేటు. ఆర్భాటంగా ప్రారంభించిన 'ప్రజా దర్బార్'కు అసలు స్పందనే కరువైంది. బాధితుడి సమస్యకు స్థానికంగా పరిష్కారం చూపకుండా పట్టణానికి రమ్మనడమేమిటి? ఇదేం పరిపాలన అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు తనకే రుణమాఫీ కాలేదని, ఇక సామాన్య రైతులకేం చేస్తారని గుమ్మడి నర్సయ్య ప్రశ్నిస్తున్నారు. తులం బంగారం, విద్యార్థులకు స్కూటీ ఏమైందని మరోపక్క ప్రజలు నిలదీస్తున్నారు. అధికారమే పరమావధిగా మేధావులను, ప్రజా సంఘాలను కాంగ్రెస్ పార్టీ వాడుకున్నది. ఉద్యమ చరిత్ర కలిగిన వారికి ప్రభుత్వంలో సాధారణ పదవులు కట్టబెట్టడం చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతున్నది.

అర్హులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేస్తామని కాంగ్రెస్ తమ 'అభయ హస్తం' మ్యానిఫెస్టోలో పేర్కొన్నది. ఇప్పటివరకు ఆ హామీని నిలబెట్టుకోలేదు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయలేదు. అంబేద్కర్ అభయహస్తం జాడే లేదు. ఇక పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీట్ల కేటాయింపుల్లో మాదిగలకు అన్యాయం జరుగుతున్నదని విన్నవించేందుకు సచివాలయానికి విచ్చేసిన మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులును సైతం ఉదయం నుంచి రాత్రివరకు వెయిట్ చేయించి.. సీఎం రేవంత్‌రెడ్డి కలవకుండానే వెళ్లిపోయారు. ఇక పలు సందర్భాల్లో ప్రోటోకాల్ పట్టించుకోకుండా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సైతం అవమానపరచడం మనందరికీ తెలిసిందే. దళిత, గిరిజన సామాజిక వర్గాలకు చెందిన ప్రతినిధుల విషయంలో రేవంత్ తన పూర్వ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారా? అనే అనుమానం కలుగుతుంది.

**-నరేష్ పాపట్ల, 95054 75431**

## • పాలకులా.. పాలోళ్లా..?



తెలంగాణలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే మనం ఎన్నుకున్నది ఎవరిని? ఎందుకు? అన్న అనుమానం రాకమానదు. ఒక వైపు బీదల ఇండ్లు, పరిశ్రమల షెడ్లు, ఫాంహౌజ్‌లు బుల్డోజర్లతో కూల్చివేతలు.. ఇంకోవైపు రైతులకు సమయానికి నీళ్లందక, రుణమాఫీ సక్రమంగా అమలుకాక ఆత్మహత్యలు, గురుకుల విద్యాలయాల్లో కలుషిత ఆహారం ఘటనలు, నేతన్నలపై ప్రభుత్వం శీతకన్ను, సర్కారు దవాఖానల్లో అంతులేని అక్రమాలు.. వంటి వాటితో ప్రభుత్వ ప్రయోజనాలు ఏవీ సగటు మనిషికి ఉపయోగపడకుండా పోతున్నాయి. అన్నింటినీ నిర్వీర్యం చేసే పనులే జోరుగా సాగుతున్నాయి.



హైదరాబాద్ నగరం ఎల్లప్పుడూ చేపలు నిండిన చెరువులా జనాలతో కళకళలాడాలని కులీకుతుబ్‌షా దేవుడ్ని ప్రార్థించాడు. అలాగే, జరిగింది కూడా. అయితే, ఇప్పటి వరకు అందుతున్న సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసి, ప్రజల ఇండ్లు, విద్యాలయాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నాశనం చేస్తున్నది. ఒక చిన్న ఇల్లు నిర్మాణం సగటు మనిషి జీవితకాల స్వప్నం. దానికోసం ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. అది గుడిసె అయినా, ఇంద్రభవనం అయినా ఆ ఇంటిల్లిపాదికీ అది గొప్ప ఆధారం. అలాంటి ఇం డ్లను అనుమతులు లేవని కూల్చడం సబ బు కాదు. అది అక్రమమే అయితే కట్టేందు కు అనుమతులు ఎందుకు ఇచ్చినట్టు? కరెంటు, నీళ్లు వంటి వాటికి పర్మిషన్లు ఎలా ఇచ్చినట్టు? ఏండ్ల తరబడి ఉంటున్న ఇంటిని కూల్చివేసి, అక్కడి నుంచి తరిమేస్తే ఆ బాధ వర్ణనాతీతం.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ రోజు ఏం జరుగుతుందో తెలియకుండా ఉన్నది. ప్రభుత్వ పెద్దల్లో ఏ ఇద్దరికీ సమన్వయం లేనట్టుగా అనిపిస్తున్నది. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రతి దానికీ గత ప్రభుత్వమే కారణమని ఆరోపించడం చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదు. గత ప్రభుత్వం కంటే వందరెట్లు మెరుగైన మార్పుతెస్తామని చెప్తేనే కదా జనం నమ్మి ఓట్లేసింది. ఇటు ఏ సంక్షేమ పథకాన్ని పొందలేక, ప్రతిదానికీ దరఖాస్తులు అంటూ కాలక్షేపం చేస్తుంటే జనం తల్లడిల్లిపోతున్నరు. అవకాశాలు మళ్లీ రావొచ్చు, రాకపోవచ్చు. కానీ, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాలోళ్లలా పగలు, ప్రతీకారాలకు అధికారాన్ని వాడుకుంటే అంతకంటే దౌర్భాగ్యం మరోటి ఉండదు. ప్రజలకు మంచి చేస్తేనే వారు గుర్తుపెట్టుకుంటారు. లేకుంటే అధఃపాతాళానికి నెడతారు.

**- భోజన్నగారి అనసూయ**

## • బీసీ లెక్కలు తారుమారు



అసెంబ్లీ ఎన్నికల వేళ బీసీ కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ బీసీలను ప్రసన్నం చేసుకుని అధికారంలోకి రాగలిగింది. ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 23 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచేందుకు కులగణన నిర్వహించింది. అంతవరకు బాగానే ఉన్నా, రాష్ట్రంలో సగానికిపైగా ఉండాల్సిన బీసీ జనాభాను 46 శాతంగా చూపిస్తుండటం వివాదానికి కారణమైంది. సర్వే నివేదికపై మండిపడుతున్న బీసీ సంఘాలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బీసీల జనాభాను కులాల వారీగా లెక్కించి రాజకీయంగా సముచిత స్థానాన్ని కల్పిస్తారని ఆశించిన బీసీల నోట్లో కాంగ్రెస్ మట్టికొట్టింది. కేసీఆర్ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 51.1 శాతంగా ఉన్న బీసీల జనాభా ఇప్పుడు ఏకంగా 5 శాతం మేర తగ్గించి చూపడం వెనక కుట్ర ఉన్నది. బీసీలను ఈ ప్రభుత్వం నిలువునా మోసం చేసింది.



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ 14 నెలల కాలంలో బీసీలకు చేసింది ఏమీ లేదు. జ్యోతిబా పూలే పేరుతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ గత బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదు. రాబోయే ఐదేండ్లలో బీసీ సంక్షేమానికి లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటివరకు పైసా కూడా విదల్చలేదు. ప్రత్యేకంగా ఎంబీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ కూడా హామీగానే మిగిలిపోయింది. అసలు బీసీ జనాభా 5 శాతం ఎందుకు తగ్గింది? వారంతా ఏమయ్యారన్నవి శేష ప్రశ్నలుగా మిగిలిపోయాయి. ఎవరికో మేలు చేయాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలా బీసీలతో దాగుడు మూతలు ఆడుతున్నది. ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కాపాడేందుకే బీసీ లెక్కలను తక్కువగా చూపుతున్నారా? అన్న అనుమానం బీసీల్లో బలపడుతున్నది. ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్ పట్ల బీసీ నిరుద్యోగ యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నది. ఇలాంటి సమయంలో ఇప్పుడు ఏకంగా బీసీ జనాభా శాతాన్నే తగ్గించడం వారిని మరింత నిరాశకు గురిచేసింది. ఈ అసంతృప్తికి ఏదో ఒక రోజు కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోకతప్పదు. ప్రభుత్వం ఇప్పటికైనా చేసిన తప్పును సవరించుకుని బీసీల రాజకీయ, ఆర్థిక, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడేలా అడుగు వేయాలి. లేదంటే బడుగు, బలహీన వర్గాల ఆగ్రహానికి గురికాక తప్పదు.

**- కె.శ్రావణ్‌కుమార్, 80960 49770**

*పనిమంతుడు పందిరేస్తే కుక్క తోక తగిలి కూలిపోయిందట. కాంగ్రెస్ పార్టీ నిర్వాకం కూడా అచ్చం ఇలాగే ఉంటుంది. హస్తం పార్టీ ప్రభుత్వాలు నిర్మించే సాగునీటి ప్రాజెక్టులను చూస్తే ఈ సామెత గుర్తుకురాక మానదు. కనీస అవగాహన, దీర్ఘకాలిక ప్రణాళిక లేకుండా, నాసిరకం పనులతో ఆ పార్టీ ప్రభుత్వాలు చేపట్టిన ప్రాజెక్టుల కారణంగా ఇప్పటివరకు ఎంతోమంది వ్యక్తులు అసువులు బాశారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయింది. అందుకు తాజా నిదర్శనమే ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదం. పేరు కోసం పాకులాడుతూ ప్రచార యావతో కనీస జాగ్రత్తలు పాటించకుండా రేవంత్‌రెడ్డి సర్కారు చేసిన నిర్వాకం వల్ల 8 మంది ప్రాణాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి. ఈ వ్యాసం రాసే సమయానికి వారి భవిష్యత్తు ఇంకా ఏమీ తేలలేదు.*

# తోక కోసం పాకులాట!



గంగుల కమలాకర్

సాగునీటి ప్రాజెక్టులను నిర్మించేటప్పుడు పలు కీలక అంశాలను దృష్టిలో పెట్టుకొని పనిచేయాల్సి ఉంటుంది. మట్టి నాణ్యత, క్యాచ్‌మెంట్ ఏరియా, నీటి లభ్యత, సగటు వర్షపాతం, ప్రాజెక్టు సామర్థ్యం... ఇలా అనేక విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాత ప్రాజెక్టుల నిర్మాణంపై ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా టన్నెల్ నిర్మాణమైతే ఇంకా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఏ మాత్రం ప్లానింగ్ లేకుండా 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణ పనులకు రెండు దశాబ్దాలు గడిచినా గుమ్మడికాయ కొట్టలేకపోతున్నాం. పడుతూ లేస్తూ పనులు సాగుతున్నాయి. ప్రచార యావ కోసం పడిచచ్చే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కనీస అధ్యయనం లేకుండా పనులు చేపట్టి కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఆ పార్టీ ప్రభుత్వాలు ముందూ వెనుకా ఆలోచించకుండా చేసిన పనుల వల్ల ప్రజాధనం వృథా అవ్వడంతో పాటు పలువురు ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది.



భౌగోళిక పరిస్థితులు, సగటు వర్షపాతం, వరదలను అంచనా వేయకుండా నిర్మల్‌లో 1950లో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన కడెం ప్రాజెక్టు ఎనిమిదేండ్లకే పునాదులతో సహా కొట్టుకుపోయింది. ఆ తర్వాత మరోసారి పునర్నిర్మాణం జరిగినా ఈ ప్రాజెక్టు ఇప్పటికీ వర్షాకాలం వస్తే గజగజ వణకాల్సిన పరిస్థితి.

***కాంగ్రెస్ సర్కార్ వైఫల్యానికి దేవాదుల మరో నిదర్శనం. కమీషన్లకు కక్కుర్తి పడి హడావుడిగా చేపట్టిన ఈ ప్రాజెక్టు నీటి ఒత్తిడికి తట్టుకోలేక పైపులు గాల్లోకి ఎగిరేయి. 2011లో దేవాదుల టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు జలసమాధి అయ్యారు. టన్నెల్ పైభాగంలో ఉన్న చలివాగు ప్రాజెక్టు నుంచి వస్తున్న నీటి ఊటను లెక్కచేయకుండా పనులు చేపట్టిన అప్పటి కాంగ్రెస్ సర్కార్ అమాయక ప్రజలను బలి తీసుకున్నది.***

ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, పునాదులు తీసి, పనులు మొదలుపెట్టి, ఆ తర్వాత డిజైన్ గురించి తీరికగా ఆలోచిస్తాయని కాంగ్రెస్ ప్రభుత్వాలకు పేరున్నది. అంతేకాదు, ప్రాజెక్టు పనులు మొదలుపెట్టాక అకస్మాత్తుగా డిజైన్ మార్చడం, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు, కమీషన్లు కొల్లగొట్టేందుకు ఒక్కసారిగా అంచనా వ్యయాన్ని పెంచడంలో కాంగ్రెస్ పార్టీ దిట్ట. తెలంగాణలో మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు చేపట్టిన ప్రాజెక్టుల పరిస్థితి అదే విధంగా ఉన్నది. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో 2009-14 మధ్యకాలంలో పూర్ణ బ్యారేజీ 40 శాతం పనులు పూర్తయ్యాక అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లను పిలవడమే అందుకు తార్కాణం. అంతవరకు ఎందుకు.. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు తలా తోక లేకుండానే మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరిట అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు దోచిపెట్టింది మనకు తెలియదా? తల లాంటి ప్రాజెక్టు పనులను వదిలేసి తోక లాంటి కాలువలను తవ్వడాన్ని మనం చూడలేదా?

తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ పార్టీ మన సాగునీటి ప్రాజెక్టులన్నింటిని సంకటంలో పడేసింది. ఏ ప్రాజెక్టు చేపట్టినా దశాబ్దాల పాటు సాగతీతే. అంతేకాదు, ఏదో ఒకరోజు వేరు కుంపటి పెట్టాల్సి వస్తుందని ముందే గ్రహించిన కాంగ్రెస్ సమైక్య పాలకులు... కృష్ణా నదిపై నిర్మించిన ప్రధాన ప్రాజెక్టులన్నీ సరిగ్గా ఏపీ-తెలంగాణ సరిహద్దుల పైనే నిర్మించి జుట్లకు జుట్లు ముడివేశారు. ఆ పంచాయితీ ఇప్పటికీ తెగడం లేదు.

*(వ్యాసకర్త: పౌరసరఫరాల శాఖ మాజీ మంత్రి)*